బలగం
BALAGAM
TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 22 ఆగస్టు 2025 | www.balagamtv.com | పేజీలు 4

# సినీ కార్మికుల సమ్మె విరమణ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దాదాపు 18 రోజుల పాటు టాలీవుడ్‌ను స్థంభింపజేసిన సినీ కార్మికుల సమ్మె ముగిసింది. 30 శాతం వేతనాల పెంపు కోరుతూ ఆగస్టు 4 నుంచి సమ్మె ప్రారంభించిన కార్మికుల పోరాటం ప్రభుత్వ జోక్యంతో ముగిసింది. నిర్మాతల మండలి–సినీ కార్మికుల ఫెడరేషన్ మధ్య గురువారం రాత్రి జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం 22.5 శాతం వేతన పెంపుపై అంగీకారం కుదిరింది.

సమ్మె కారణంగా టాలీవుడ్‌లోని అన్ని సినిమాలు, టీవీ సీరియళ్లు, వెబ్‌సిరీస్ షఉటింగ్‌లు పూర్తిగా నిలిచిపోయాయి. అనేకసార్లు జరిగిన చర్చలు ఫలించకపోవడంతో పరిస్థితి కఠినంగా మారింది. పలువురు ప్రముఖులు జోక్యం చేసుకున్నా పరిష్కారం దొరకలేదు. చివరికి ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు, ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు, తెలంగాణ ప్రభుత్వం చొరవ చూపడంతో వివాదం కొలిక్కి వచ్చింది.

హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద లేబర్ కమిషనర్ కార్యాలయంలో నిర్మాతల మండలి ప్రతినిధులు, ఫెడరేషన్ నేతల మధ్య జరిగిన ఐదు రౌండ్ల చర్చల తర్వాత సయోధ్య సాధ్యమైంది. చివరి రౌండ్‌లో నిర్మాతల మండలి, ఫెడరేషన్ అధ్యక్షులు అనిల్‌కుమార్ వల్లభనేని, ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు కులిమిల్లి తదితర కీలక మిగితా 2వ పేజీలో

# ఇక రెండు శ్లాబుల జీఎస్టీ

- జీఎస్టీ 12%, 28% స్లాబుల రద్దుకు సంబంధిత మంత్రుల సమూహం ఆమోదం
- తుది నిర్ణయం కౌన్సిల్‌దే
- ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో చేసిన పన్ను సంస్కరణల ప్రకటనకు అనుగుణంగా చర్యలు




**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

జీఎస్టీ పన్ను వ్యవస్థ సరళీకరణ దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. వస్తువులు, సేవల పన్నులోని 12% మరియు 28% స్లాబుల తొలగింపుకు సంబంధిత మంత్రుల సమూహం గురువారం ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదన ఇప్పుడు జీఎస్టీ కౌన్సిల్ ముందుకు వెళ్లనుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 15న ఎర్రకోట ప్రాంగణం నుంచి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో పన్ను వ్యవస్థ సరళీకరణపై సంకేతాలు ఇవ్వగా, ఆ ప్రక్రియలో భాగంగానే ఈ చర్య చేపట్టబడింది.తుది ఆమోదం లభిస్తే, ప్రస్తుత నాలుగు స్లాబుల్లో 5% మరియు 18% మాత్రమే మిగలనున్నాయి. అదనంగా, అత్యంత విలాస వస్తువుల కోసం 40% ప్రత్యేక స్లాబు ప్రతిపాదనలో ఉంది.

**రాష్ట్రాల అభిప్రాయాలు, పరిహారం అంశం కీలకం**

జీఎస్టీ కౌన్సిల్‌లో రాష్ట్రాల మంత్రులు కూడా సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రాల ఆదాయం తగ్గిపోతే పరిహారం ఎలా అందిస్తారన్న దానిపై ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి. బీహార్ ఉపముఖ్యమంత్రి, గోఎమ్ కన్వీనర్ సమ్రాట్ చౌదరి మాట్లాడుతూ, "కేంద్రం ప్రతిపాదనపై అందరూ సూచనలు చేశారు. కొంతమంది రాష్ట్రాలకు అభ్యంతరాలు ఉన్నాయి. వాటిని కూడా కౌన్సిల్‌కు నివేదిస్తున్నాం" అన్నారు.

పశ్చిమ బెంగాల్ ఆరోగ్యమంత్రి చంద్రిమా భట్టాచార్య మాట్లాడుతూ, "రాష్ట్రాల ఆదాయనష్టం ఎంత అవుతుందో ఇప్పటివరకు అంచనా వేయలేదు. నష్టపరిహారం ఎలా ఇస్తారన్నదే మాకు సందేహం" అని తెలిపారు. ఉత్తరప్రదేశ్ ఆర్థికమంత్రి సురేశ్ ఖన్నా కూడా స్పందిస్తూ, "ప్రజలకు మేలు జరిగేలా ఉండాలని మా ఆకాంక్ష" అన్నారు.

**ప్రధాని మోదీ సంకేతం**

ఈ ప్రతిపాదన ప్రధానమంత్రి మోదీ ఆగస్టు 15న ప్రకటించిన పన్ను సంస్కరణలలో భాగమే. 12% మరియు 28% స్లాబుల తొలగింపు ద్వారా పన్ను వ్యవస్థను సులభతరం చేసి, వివాదాలను తగ్గించాలన్నదే కేంద్ర ఉద్దేశం.

జీఎస్టీలో ప్రస్తుతం 5, 12, 18, 28 శాతం పన్ను స్లాబులున్నాయి. మార్కెట్‌లోని దాదాపు అన్ని వస్తూత్పత్తులపై ఈ స్లాబుల ప్రకారమే పరోక్ష పన్నులు పడుతున్నాయి. అయితే, 5, 18శాతం స్లాబ్‌లను మాత్రమే కొనసాగించాలని, 12, 28 స్లాబ్‌లను తొలగించాలని కేంద్రం ప్రతిపాదించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ.. ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన కమిటీకి ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు ఆయా రాష్ట్రాల మంత్రులతో కూడిన బృందం తాజాగా ఆమోదం తెలిపింది. ఆల్ట్రా లగ్జరీ, సిన్ గూడ్స్ (సిగరెట్లు వంటివి)పై 40 శాతం పన్ను విధించడం కూడా కేంద్ర ప్రతిపాదనలో ఉందని యూపీ ఆర్థికమంత్రి సురేష్ కుమార్ ఖన్నా తెలిపారు. 12 శాతం స్లాబులోని 99 శాతం వస్తూత్పత్తులు 5 శాతంలోకి, 28 శాతం స్లాబులోని 90 శాతం వస్తూత్పత్తులు 18 శాతంలోకి రానున్నట్లు తెలిసింది.

ప్రస్తుతం జీఎస్టీలో కనీస పన్ను 5 శాతం స్లాబులో రోజువారీ నిత్యావసర వస్తూత్పత్తులున్నాయి. ఇక స్టాండర్డ్ గూడ్స్‌పై 12 శాతం, ఎలక్ట్రానిక్స్, ఆయా రకాల సేవలపై 18 శాతం, పొగాకు, ఇతర విలాసవంతమైన ఐటమ్స్‌పై గరిష్ఠంగా 28 శాతం పన్నులు పడుతున్నాయి. ఈ క్రమంలోనే అదనంగా పాన్ మసాలా, లగ్జరీ కార్లు తదితరాలపై జీఎస్టీ నష్టపరిహార సెస్సును కూడా విధిస్తున్నారు. జీఎస్టీ అమలుతో రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయానికి వాటిల్లుతున్న నష్టాలను భర్తీ చేయడానికే ఈ సెస్సు. అలాగే కొన్ని నిత్యావసరాలకు జీఎస్టీ మినహాయింపుండగా.. ప్రత్యేకంగా వజ్రాలు, సానబెట్టిన రత్నాలు, బంగారంపై 0.25 శాతం నుంచి 3 శాతం వరకు జీఎస్టీ విధిస్తున్నారు.



## రాష్ట్రాల ఆదాయాలు క్షిణించొద్దు

- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రాల ఆదాయాలు క్షీణించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు నిధుల పంపిణీ వాటా ప్రకారం జరగడం లేదని అన్నారు. ఢిల్లీలో జిఎస్టి సమావేశంలో భట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రాల ఆదాయాలు పడిపోకుండా చర్యలు తీసుకోవడం తప్పనిసరి అని సూచించారు. సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులు దెబ్బతినే ప్రమాదం జరుగుతుందని తెలియజేశారు. దేశ ఆదాయ వృద్ధిలో రాష్ట్రాల కృషి గణనీయమని, జిఎస్టి రేట్ల సరళీకరణ, పన్ను భారం తగ్గించడం ఆహ్వానించదగినదే అని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు జాతీయ ఆదాయం తగిన వాటా రావడం లేదని విమర్శించారు. పరిహార సెస్సు కొనసాగించి.. ఆదాయాన్ని పంచాలన్న భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

'గవర్నర్ బాధ్యత నిర్వర్తించకపోతే

# కోర్టు చేతులు కట్టుకుపోవాలా?

- ప్రజాప్రతినిధుల అభిప్రాయాలకున్న రక్షణ ఏమిటి?
- రాష్ట్రపతి ప్రస్తావనపై ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- ప్రతి సమస్యకు కోర్టు పరిష్కారం కాదు
- కోర్టులు టైమ్‌లైన్ విధించలేవు
- రాజకీయ పరిష్కారాలే మార్గం
- పార్లమెంట్ పని అది : కేంద్రం వాదనలు



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

గవర్నర్‌లు రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులపై జాప్యం చేస్తున్న సందర్భాల్లో న్యాయస్థానాలు పరిష్కారం చూపలేవని, అలాంటి సమస్యలకు రాజకీయ మార్గాలే ఉన్నాయని భారత సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టులో అభిప్రాయపడ్డారు. ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌లో భాగంగా బిల్లుల ఆమోదంపై విచారణ చేపట్టిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఎదుట ఆయన వాదనలు వినిపించారు. ఈ ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయి, జస్టిస్ సూర్యకాంత్, విక్రమ్ నాథ్, పీఎస్ నరసింహ, ఏఎస్ చందుర్కర్ ఉన్నారు.

సొలిసిటర్ జనరల్ మాట్లాడుతూ "ఒక గవర్నర్ బిల్లులను నిలిపివేస్తే, రాజకీయ పరిష్కారాలు ఉన్నాయి. ముఖ్యమంత్రులు ప్రధాని లేదా రాష్ట్రపతిని కలిసి సమస్యను పరిష్కరించుకుంటారు. కొన్ని సందర్భాల్లో టెలిఫోన్ సంభాషణల ద్వారానే పరిష్కారం వస్తుంది. కాబట్టి ఇలాంటి విషయాల్లో కోర్టు టైమ్‌లైన్ విధించలేదు. రాజ్యాంగంలో ఎక్కడ అవసరం ఉందో అక్కడే గడువులు పేర్కొన్నారు. మిగిలిన సందర్భాల్లో ఫ్రేమ్‌వర్క్ జాగ్రత్తగా వదిలేశారు" అని వ్యాఖ్యానించారు.

**"ప్రతి సమస్యకు కోర్టే పరిష్కారం కాదు"**

తన వాదనను మరింత స్పష్టతతో కొనసాగిస్తూ సొలిసిటర్ జనరల్ "దేశంలో ప్రతి సమస్యకు కోర్టే పరిష్కారం కాదు. రాజ్యాంగపరమైన బాధ్యతలు నిర్వర్తించకపోతే రాజకీయ పరిపక్వతతో, రాజ్యాంగ ఫంక్షనరీల మధ్య చర్చలతో పరిష్కారం సాధ్యం. కోర్టు కొత్తగా గడువు విధించడం రాజ్యాంగ పరిధికి మించి ఉంటుంది" అని అన్నారు.

ఈ దశలో ధర్మాసనంలోని న్యాయమూర్తులు కొన్ని ప్రశ్నలు లేవనెత్తారు.

సీజేఐ గవాయి: "గవర్నర్ ఎలాంటి కారణం లేకుండా తన బాధ్యత నిర్వర్తించకపోతే కోర్టు చేతులు కట్టుకుపోవాలా?" అని ప్రశ్నించారు.

జస్టిస్ సూర్యకాంత్: "రాష్ట్రాలు గవర్నర్ అక్రమ ఆలస్యం పై కోర్టుకు వస్తే, న్యాయపరిశీలన పూర్తిగా నిరాకరించబడుతుందా?" అని అడిగారు.

దీనికి సొలిసిటర్ జనరల్ సమాధానంగా –"నేను జస్టిసబిలిటీని వ్యతిరేకించడం లేదు. కానీ కోర్టు గడువు విధించే అధికారం లేదు. న్యాయస్థానం భావోద్వేగాలపై ఆధారపడి కొత్త పదాలు రాజ్యాంగంలో చేర్చలేదు" అని తెలిపారు.

"ఈ అంశంలో పార్లమెంట్ పరిష్కారం చూపగలదు. కోర్టు సూచించవచ్చు కానీ మరో రాజ్యాంగ అధికారిని నేరుగా ఆదేశించలేదు. అదే రాజ్యాంగ సమన్వయం" అని తుషార్ మెహతా స్పష్టం చేశారు.

అలాగే రాజ్యాంగంలో 31 సందర్భాల్లోనే ప్రత్యేకంగా గడువులు పేర్కొన్నారని గుర్తుచేశారు. "ఫ్రేమర్స్ ఎక్కడ అవసరం ఉందో అక్కడే టైమ్‌లైన్ చేర్చారు. గవర్నర్ బిల్లుల విషయంలో గడువు లేకపోవడం వారి స్పష్టమైన నిర్ణయమే" అని ఆయన ధర్మాసనానికి వివరించారు.

# న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి నామినేషన్



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

రాబోయే ఉపరాష్ట్రపతి ఎన్నికలు హోరాహోరీగా మారబోతున్నాయి. ఇండియా కూటమి తరఫున సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి గురువారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారికి పత్రాలను అందజేసిన ఆయన వెంట కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్, శివసేన నేత సంజయ్ రౌత్ సహా పలు పార్టీలు నుంచి కీలక నాయకులు హాజరయ్యారు.

నామినేషన్ అనంతరం జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ "ఉపరాష్ట్రపతి ఎన్నిక వ్యక్తిగత పోటీ కాదు. ఇది ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రత, పార్లమెంటులో విభిన్న అభిప్రాయాలకు గౌరవం, సమన్వయాన్ని కాపాడే ఎన్నిక. ఎన్నికైతే నిష్పాక్షికత, గౌరవం, సంభాషణ, మర్యాదలతో బాధ్యతలు నిర్వర్తిస్తా. ప్రతిపక్షాల అభ్యర్థిగా నన్ను నిలబెట్టడం గౌరవంగా భావిస్తున్నా. రాజ్యాంగంపై విశ్వాసం, ప్రజలపై ఆశతో ఈ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నా" అని వ్యాఖ్యానించారు.

ఇక ఎన్‌డీఏ తరఫున సీపీఐ సీనియర్ నేత, తమిళనాడు మాజీ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ బుధవారం నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఎన్‌డీఏ మిత్రపక్ష నేతలు హాజరయ్యారు. ఉపరాష్ట్రపతి ఎన్నికను ఏకగ్రీవంగా జరపాలన్న ఉద్దేశంతో ప్రధాని మోదీ, బీజేపీ అధినేతలు విపక్షాలను సంప్రదించినప్పటికీ ప్రతిపక్షాలు తమ అభ్యర్థిని నిలబెట్టడంతో పోటీ అనివార్యమైంది. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది.



కాళేశ్వరం నివేదికపై

# చర్యలు తీసుకుంటారా

- తెలంగాణ హైకోర్టు
- కాళేశ్వరం నివేదికపై కేసీఆర్, హరీష్ పిటిషన్ల విచారణ వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాళేశ్వరం ప్రాజెక్టు పై పీసీ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి టి. హరీష్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. అయితే ఈ కేసును కోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది.

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఆర్యమా సుందరం, శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు. నివేదికలోని కొన్ని భాగాలను మాత్రమే ఎంచుకొని ముందుగా విడుదల చేయడం, కేసీఆర్ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఆరోపణలు చేయడం జరిగిందని వారు వాదించారు. కేసీఆర్‌కి ముందుగా నోటీసు ఇవ్వకుండానే నివేదికను విడుదల చేయడం చట్టవిరుద్ధమని వాదనలు వినిపించారు. హరీష్‌రావు తరఫు న్యాయవాది మాట్లాడుతూ, ఆయనను సాక్షిగా మాత్రమే పిలిచారని, కానీ నివేదిక కాపీ ఇవ్వకుండా ఆయన పేరును ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రస్తావించడం అన్యాయం అని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

విచారణలో భాగంగా హైకోర్టు బెంచ్ తన ముందున్న మిగితా 2వ పేజీలో

# మేడారం జాతర నిర్వహణకు రూ.150 కోట్లు



- శాశ్వత నిర్మాణాలు, రోడ్లు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి వసతుల మెరుగుదల.
- వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న జాతర వైభవంగా నిర్వహణ.
- సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం ఆదివాసీ గౌర


**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా పేరుగాంచిన సమ్మక్క–సారలమ్మ మేడారం మహాజాతర నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. జాతర విజయవంతంగా సాగేందుకు శాశ్వత నిర్మాణాలు, రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనులకు రూ.150 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులను గిరిజన సంక్షేమ శాఖ ద్వారా వినియోగించనున్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ మహా జాతరలో కోట్లాది భక్తులు పాల్గొంటారు. వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న జాతర ఎన్నడూ లేని రీతిలో వైభవోపేతంగా, చారిత్రాత్మకంగా సాగేందుకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంజూరు చేసిన నిధుల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్లకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా–శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ "ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఆదివాసీల గౌరవానికి ప్రతీక. మేడారం మహా జాతర కోసం రూ.150 కోట్లు మంజూరు చేయడం, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గిరిజనుల పట్ల చూపుతున్న చిత్తశుద్ధికి నిదర్శనం. ఈ సారి జాతర మరింత గొప్పగా, చారిత్రాత్మకంగా జరగనుంది" అని పేర్కొన్నారు.

# పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధిక వాయిదా




**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. జూలై 21న ప్రారంభమైన ఈ సమావేశాలు దాదాపు నెలరోజులపాటు కొనసాగినా, ప్రజా సమస్యలపై ప్రాముఖ్యత గల చర్చలు జరగకుండానే ముగిశాయి. సభ ప్రారంభం నుంచి బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితా సవరణలు (సర్) ప్రధాన వివాదంగా మారాయి. ఈ ప్రక్రియలో పెద్ద ఎత్తున ఓట్ల చోరీ జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆప్ మినహా ప్రతిపక్ష పార్టీలు పట్టుబట్టాయి. అయితే ఎన్నికల సంఘం వ్యవస్థాగత అంశమని, అంతేకాక దీనిపై విచారణ కోర్టు పరిధిలో ఉన్నందున చర్చ జరపలేమని ప్రభుత్వం స్పష్టం చేసింది. దాంతో ఉభయసభలు దాదాపు ప్రతిరోజూ వాయిదా పడ్డాయి. ఈ గందరగోళ మధ్య ప్రభుత్వం 14 బిల్లులను ప్రవేశపెట్టగా, వాటిలో 12కి ఆమోదం లభించింది. దేశంలో ఆన్‌లైన్ గేమ్స్, సంబంధిత యాప్‌లపై నిషేధ బిల్లు, అలాగే సముద్ర జలాల రవాణా బిల్లు వంటి కీలకమైన బిల్లులు కూడా ఆమోదం పొందాయి. సభ చివరి రోజున కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. ఉదయం లోక్‌సభ రెండు సార్లు సర్ అంశంపైనే వాయిదా పడగా, మధ్యాహ్నం తరువాత స్పీకర్ ఓం బిర్లా లాంఛనపూర్వకంగా సెషన్ ముగింపు ప్రసంగం చేసి సభను నిరవధిక వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే గందరగోళం కొనసాగి, చర్చలేమీ జరగకుండానే సమావేశాలు ముగిశాయి. "ప్రజా సమస్యలపై చర్చకు వీల్లేకపోవడం బాధాకరం. సభ ఈ విధంగా సాగడం విచారకరం" అని రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రజా ధనం దోపిడీని అడ్డుకుంటాం.

- మూసీపై సీఎం రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందన

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



గోదావరి జలాలతో మూసీ నదిని 365 రోజులు పారిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే గోదావరి నీళ్లను హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు తెచ్చిందని, ముఖ్యంగా కొండపోచమ్మసాగర్ ద్వారా ఈ సౌకర్యం కల్పించిందని ఆయన గుర్తు చేశారు. 2022లోనే రూ.1,100 కోట్ల వ్యయంతో కొండపోచమ్మసాగర్ నుండి గండిపేట చెరువుకు గోదావరి నీటిని తరలించే ప్రతిపాదనకు కేసీఆర్ ప్రభుత్వం ఆమోదం ఇచ్చిందని కేటీఆర్ వివరించారు. మూసీ నదిలోకి చేరే 2,000 ఎంఎల్‌డీ మురికినీటిని శుద్ధి చేసేందుకు మొత్తం 36 ఎస్టీపీలు నిర్మాణం పూర్తి చేసినది కేసీఆర్ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. నాగోల్ ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల మేర మూసీ సుందరీకరణ, ఉప్పల్ భాగాయత్‌లో శిల్పారామం ఏర్పాటు వంటి పలు కార్యక్రమాలు చేపట్టినదీ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మిగితా 2వ పేజీలో

# టీజీ ఐసెట్ - 2025 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీ ఐసెట్ – 2025 కు సంబంధించి ఉన్నత విద్యామండలి కీలక ప్రకటన చేసింది. కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేసింది. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని సూచించింది.

**ఫస్ట్ ఫేజ్ షెడ్యూల్:**

ఆగస్టు 20 – 28: ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం స్లాట్ బుకింగ్.

ఆగస్టు 22 – 29: సర్టిఫికెట్ వెరిఫికేషన్.

ఆగస్టు 25 – 30: వెబ్ ఆప్షన్ల నమోదు.

ఆగస్టు 30: వెబ్ ఆప్షన్ల ఫ్రీజింగ్.

సెప్టెంబర్ 2: సీట్ల కేటాయింపు.

సెప్టెంబర్ 2 – 5: సీటు పొందిన అభ్యర్థులు సంబంధిత కాలేజీల్లో ట్యూషన్ ఫీజు చెల్లించి, సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి.

**ఫైనల్ ఫేజ్ షెడ్యూల్:**

సెప్టెంబర్ 8: ఆన్‌లైన్ వివరాల నమోదు, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం స్లాట్ బుకింగ్.

సెప్టెంబర్ 9: సర్టిఫికెట్ వెరిఫికేషన్.

సెప్టెంబర్ 9 – 10: వెబ్ ఆప్షన్ల నమోదు.

సెప్టెంబర్ 10: వెబ్ ఆప్షన్ల ఫ్రీజింగ్.

సెప్టెంబర్ 13: సీట్ల కేటాయింపు.

సెప్టెంబర్ 13 – 15: సీటు పొందిన అభ్యర్థులు ట్యూషన్ ఫీజు చెల్లించి, సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలి.

సెప్టెంబర్ 15: స్పాట్ అడ్మిషన్ల విధివిధానాల ప్రకటన.

ఉన్నత విద్యామండలి అధికారులు అభ్యర్థులు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించాలని, అవసరమైన సర్టిఫికెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

### కాళేశ్వరం నివేదికపై

# చర్యలు తీసుకుంటారా

(మొదటి పేజీ తరువాయి)

కమిషన్ నివేదిక స్పష్టంగా లేదని గమనించింది. కాబట్టి సరైన కాపీలను సమర్పించాల్సిందిగా ఆదేశించింది. ప్రభుత్వ తరపున వాదించిన అడ్వకేట్ జనరల్ ఏ. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసినట్లు, నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తరువాతే ప్రజలకు అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు. దీనిపై కోర్టు ప్రశ్నించగా, అసెంబ్లీ చర్చకు ముందు లేదా తరువాత చర్యలు తీసుకుంటారా అన్న దానిపై సమాధానం ఇవ్వడానికి సమయం కావాలని ప్రభుత్వ తరపు అభ్యర్థించడంతో విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

# ప్రజా ధనం దోపిడీని అడ్డుకుంటాం.

(మొదటి పేజీ తరువాయి)

గుర్తు చేశారు. అలాగే, రూ.16,000 కోట్లతో మాస్టర్ ప్లాన్, డీపీఆర్ సిద్ధం చేసిన కేసీఆర్ ప్రభుత్వాన్ని తక్కువ చేసి చూపుతూ, కాంగ్రెసు ప్రభుత్వం అంచనాలను రూ.1,50,000 కోట్లకు పెంచిందని, ఇది మహా దోపిడీ తప్ప మరేదీ కాదని కేటీఆర్ తీవ్రంగా

విమర్శించారు. "ప్రజా ధనం దోపిడీని ఖచ్చితంగా అడ్డుకుంటాం. ఢిల్లీకి మూటలు పంపి పదవిని కాపాడుకోవడానికే పడుతున్న తాపత్రయానికి నగరాభివృద్ధి అనే ముసుగు వేసుకోవడం ప్రజలకు బహిర్గతమైంది. ఒకవైపు కాళేశ్వరం కూలిపోయిందని అబద్ధాలు చెబుతూనే మరోవైపు అదే ప్రాజెక్టులో భాగమైన కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని తెస్తామనడం తెలంగాణ ప్రజలందరికీ స్పష్టంగా కనబడుతోంది" అని కేటీఆర్ ఎండగట్టారు.

# బీజేపీ అధికారంలోకి వచ్చాక జర్నలిస్టులకు ఇళ్లు

- **కేంద్ర మంత్రి బండి సంజయ్**

**బలగం టీవీ, హైదరాబాద్**



జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ సహా హౌసింగ్ సొసైటీలకు భూ కేటాయింపుల్ని రద్దు చేస్తూ 2024లో ఇచ్చిన తీర్పుపై దాఖలైన రివ్యూ పిటిషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేయడంతో తీవ్ర నిరాశ, నిస్పృహల్లో మునిగిపోయిన జర్నలిస్టులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బాసటగా నిలిచారు. జర్నలిస్టులెవరూ బాధపడొద్దని సూచించారు. జర్నలిస్టులకు బిజెపి అండ గా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈసారి రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది బిజెపియేనని తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా న్యాయ నిపుణులతో ముందుగానే చర్చించి జర్నలిస్టులందరికీ ఇండ్లను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు దక్కకపోవడానికి కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల అవకాశవాద రాజకీయాలే కారణమని విమర్శించారు.

# నిరుద్యోగులకు శుభవార్త

- **రెవెన్యూ శాఖలో 217 పోస్టులు మంజూరు**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు గుడ్ న్యూస్ తెలిపింది. రెవెన్యూ శాఖలో 217 పోస్టులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఈ పోస్టులున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన కొత్తగా ఏర్పాటు చేసిన 15 రెవెన్యూ మండలాల్లో 189 పోస్టులు, అలాగే రెండు డివిజన్ల కోసం మరో 28 పోస్టులు మంజూరు చేస్తూ గురువారం జీఓ విడుదల చేసింది. గద్వాల, నల్గొండ, వికారాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, వనపర్తి, మహబూబ్ నగర్ జిల్లాలో ఈ పోస్టులను భర్తీ చేసేందుకు అతి త్వరలో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ ప్రకటనతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# దేశ ప్రజలకు ఇంధన భద్రత

- **కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి**

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశంలోని ప్రతి పౌరుడికి అందుబాటు ధరల్లో ఇంధనాన్ని అందించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి స్పష్టం చేశారు. గురువారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు.

ముడి చమురు ధరలు అంతర్జాతీయంగా భారీగా పెరిగినా వినియోగదారులపై భారం పడకుండా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని పురి తెలిపారు. 2021 నవంబర్, 2022 మే నెలల్లో రెండు విడతలుగా పెట్రోల్‌పై లీటరుకు రూ.13, డీజిల్‌పై రూ.16 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించారని గుర్తుచేశారు. దీని ఫలితంగా కొన్ని రాష్ట్రాలు వ్యాట్ తగ్గించడంతో ప్రజలకు మరింత ఊరట లభించిందని చెప్పారు.

ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీలు) కూడా 2024 మార్చిలో పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయని మంత్రి వివరించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో 2022 జూన్‌లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 116 డాలర్ల గరిష్ఠానికి చేరినా దేశీయంగా ధరలను నియంత్రించగలిగామని తెలిపారు.

2021 నవంబర్‌లో ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.110.04 ఉండగా, ప్రస్తుతం రూ.94.77కు తగ్గిందని, డీజిల్ ధర రూ.98.42 నుంచి రూ.87.67కు తగ్గిందని పురి వివరించారు. 2025 ఏప్రిల్‌లో ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.2 పెంచినా ఆ భారాన్ని వినియోగదారులపై మోపకుండా చమురు సంస్థలే భరించాయని ఆయన స్పష్టం చేశారు.

# యూరియాతో రాజకీయాలు చేస్తున్నారు

- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం**

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణలో యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే కారణమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు మార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి కేటాయించాల్సిన యూరియాను నెలాఖరులోపు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ తుమ్మల మాట్లాడుతూ, "కేంద్రం చేతకానితనంతోనే తెలంగాణ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుల కష్టాలను పక్కనబెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ యూరియాపై ఆటలాడుతోంది" అని ఆరోపించారు.

సీఎం రేవంత్‌రెడ్డి యూరియా సమస్యపై రాష్ట్రపతి అపాయింట్మెంట్ కోరగా ప్రధాని మోదీ అడ్డుకున్నారని తుమ్మల ఆరోపించారు. దేశవ్యాప్తంగా యూరియా ఉత్పత్తి ఆగిపోవడాన్ని కేంద్రం దాచిపెడుతోందని విమర్శించారు. "కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే బీజేపీ ఉద్దేశ్యం" అని వ్యాఖ్యానించారు.

బీజేపీ నేతల "మూర్ఖపు వ్యాఖ్యలు"తో పార్టీ బలపడదని తుమ్మల హెచ్చరించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు వాస్తవాలను అంగీకరించాలని డిమాండ్ చేశారు. "రామ్‌చందర్‌రావు బాధ్యతగల పదవిలో ఉండి సోయిలేకుండా మాట్లాడుతున్నారు. బీజేపీ నేతలు అవాస్తవాలు ప్రచారం చేసి రైతులను మభ్యపెట్టకండి" అని తుమ్మల మండిపడ్డారు.

కొంతమంది నేతలు రైతుల సమస్యలను అడ్డుపెట్టుకుని "చచ్చిన పార్టీని బతికించుకోవాలని ప్రయత్నిస్తున్నారు" అంటూ ఎద్దేవా చేశారు. రాజకీయాల కోసం అవాస్తవాలు ప్రచారం చేయడం వల్ల బీజేపీ పరువు పోతుందని హెచ్చరించారు. "రైతులు, ప్రజలు ఇలాంటి కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి" అని తుమ్మల స్పష్టం చేశారు.

# సినీ కార్మికుల సమ్మె విరమణ



(మొదటి పేజీ తరువాయి)

నేతలు పాల్గొన్నారు.

**24 విభాగాల కార్మికులకు లాభం**

టాలీవుడ్‌లో పనిచేస్తున్న సుమారు 28 వేల మంది కార్మికులు ఈ వేతన పెంపు వల్ల లాభం పొందనున్నారు. వీరిలో 4 వేల మంది జూనియర్ ఆర్టిస్టులు ఉంటారు. ఇప్పటి వరకు రోజువారీగా జూనియర్ ఆర్టిస్టులకు రూ.2000–3000, మిగతా వృత్తులవారికి రూ.800–1800 మధ్య వేతనాలు చెల్లించేవారు. కొత్త అంగీకారంతో వేతనాల్లో గణనీయమైన పెరుగుదల లభిస్తుంది.

ఫెడరేషన్ పోరాటానికి సిఐటియు రాష్ట్ర కమిటీ మద్దతు తెలిపింది. 36 విభాగాల సంఘాలు కలిసి పోరాటం కొనసాగించడంతో చివరకు నిర్మాతలు వేతన పెంపుకు ఒప్పుకోవాల్సి వచ్చింది.

"కార్మికుల కష్టానికి న్యాయం జరిగిందని, రేపటినుంచి షూటింగ్‌లు మామూలుగా ప్రారంభమవుతాయని" నిర్మాతల మండలి, ఫెడరేషన్ నేతలు ఉమ్మడిగా ప్రకటించారు.

# రూ. 400 కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా

- **జూబ్లీఎన్‌క్లేవ్‌లో ఆక్రమణలు తొలగింపు**
- **పార్కులతో పాటు రహదారులను కాపాడిన హైడ్రా**
- **దాదాపు 16000 గజాల స్థలాన్ని కాపాడిన హైడ్రా**

**బలగం టీవీ, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మాదాపూర్ ప్రాంతంలోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో పార్కులతో పాటు రహదారుల ఆక్రమణలను గురువారం హైడ్రా తొలగించింది. 22.20 ఎకరాలలో దాదాపు 100 ప్లాట్లతో అనుమతి పొందిన ఈ లే ఔట్‌లో 4 పార్కులుండగా 2 కబ్జా(దాదాపు 8 వేల 500 గజాలు)కు గురయ్యాయి. అలాగే 5 వేల గజాల మేర రోడ్డు కూడా కబ్జా అయ్యింది. వీటికి తోడు.. దాదాపు 300 గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన హోటల్ షెడ్డును కూడా హైడ్రా తొలగించింది. ఇలా మొత్తం 16000 గజాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. దీని విలువ దాదాపు రూ. 400 కోట్ల వరకు ఉంటుందని అంచనా. 1995లో అనుమతి పొందిన ఈ లే ఔట్‌ను 2006లో ప్రభుత్వం రెగ్యులరైజ్ కూడా చేసింది. ఈ లే ఔట్ ప్రకారం .జీహెచ్ఎంసీకి గిఫ్ట్ డీడ్ చేసిన పార్కులను జైహింద్‌రెడ్డి అనే వ్యక్తి కబ్జా చేశారంటూ జూబ్లీ ఎన్‌క్లేవ్ లే ఔట్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారించిన హైడ్రా అధికారులు కబ్జాలు వాస్తవమే అని నిర్ధారించుకున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు వాటిని గురువారం తొలగించారు. హైడ్రా ఏసీపీ శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్, బాలగోపాల్ నేతత్వంలో ఈ కూల్చివేతలు జరిగాయి. వెనువెంటనే పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడినట్టు సూచిస్తూ బోర్డులు కూడా పెట్టారు. పార్కులు, ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. కబ్జాకు పాల్పడ్డవారిపై పోలీస్ కేసులు కూడా పెడుతున్నట్టు హైడ్రా అధికారులు తెలిపారు.

లే ఔట్ ప్రకారం ఉన్న 4 పార్కుల్లో 2 పార్కులు, ఒక రహదారి, ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైనట్టు వెల్లడి కావడంతో గురువారం ఈ మేరకు చర్యలు తీసుకుంది. హైటెక్ సిటీ నుంచి కొండాపూర్ రహదారికి ఆనుకొని మెటల్ చార్మినార్‌కు ఎదురుగా దాదాపు 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి.. అనుమతి లేకుండా హోటల్ నిర్మించి అద్దెలను జైహింద్‌రెడ్డి పొందుతున్నాడని.. అదే స్థలంలో భారీ ప్రకటనల హోర్డింగ్ కూడా పెట్టి రెండింటి ద్వారా నెలకు రూ. 4 లక్షల వరకూ ఆదాయం పొందుతున్నాడని జూబ్లీ ఎన్‌క్లేవ్ ప్రతినిధులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలంలో హోటల్‌ను నిర్మించి అద్దె వసూలు చేస్తున్న వైనంపై గతంలో జీహెచ్ఎంసీ నోటీసులు కూడా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. 2006లో రెగ్యులరైజ్ అయిన లే ఔట్ అక్కడి ప్లాట్ యజమానులకు తెలవకుండా తర్వాత ఎలా రద్దౌతుందని వాపోయారు. యూఎల్‌సీ ల్యాండ్ అయితే ప్రభుత్వానికి చెందుతుందని.. మధ్యలో జైహింద్‌రెడ్డిది ఎలా అవుతుందని ఎన్‌క్లేవ్ ప్రతినిధులు ఫిర్యాదులో పేర్కొన్నారు. యూఎల్‌సీ ల్యాండ్ తన సొంతం అయితే ప్లాట్ల జోలికి రాకుండా.. పార్కులే ఎలా జైహింద్‌రెడ్డివి అవుతాయని అంటున్నారు. జైహిద్‌రెడ్డిపై చాలావరకు ల్యాండ్ గ్రాబింగ్ కేసులున్నాయని.. ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. పార్కులను కాపాడిన హైడ్రాకు కతజ్ఞతలు తెలిపారు. చుట్టూ ఐటీ కార్యాలయాలు, నివాసాలు ఉన్న ప్రాంతంలో పార్కులను కాపాడి.. ఇక్కడివారికి హైడ్రా ఊపిరి అందించిందని పేర్కొన్నారు. హైడ్రాను ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డితో పాటు.. ప్రభుత్వ భూములు, పార్కులు, చెరువులు, నాలాలను కాపాడుతున్న హైడ్రా ఉద్యోగులు వారిని ముందుండి నడిపిస్తున్న కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# నిబంధనలు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

- గణేష్ మండపాల వద్ద పోలీస్ శాఖ వారి అనుమతితో చిన్న స్పీకర్లు మాత్రమే ఏర్పాటు చేయాలి
- డీజే నిర్వాహకులకు వేములవాడ రూరల్ సీ ఐ శ్రీనివాస్ సూచన

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల పరిధిలోని డి.జే యజమానులతో వేములవాడ రూరల్ సీ.ఐ శ్రీనివాస్ బుధవారం రోజున సమావేశం నిర్వహించి, వారికి తగిన సూచనలు చేశారు.ఈ సందర్భంగా సీ.ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా డి.జే లు నిర్వహించిన, యాంప్లిఫైయర్ తో బాక్స్ లు ఏర్పాటు చేసిన, కఠిన చర్యలు తీసుకుంటామని, గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో మండపాల వద్ద కానీ, శోభయాత్రలో కానీ,




డీజేలు కానీ యాంప్లిఫైయర్ తో బాక్స్ లు ఏర్పాటు చేసి, ప్రజలకు ఇబ్బంది కలిగించిన డి.జే యజమానులతో పాటుగా నిర్వహకులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేష్ మండపాల వద్ద పోలీస్ అధికారుల అనుమతితో చిన్న స్పీకర్లు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని, అదికూడా రాత్రి 10 గంటల వరకు మాత్రమే అని, అధిక శబ్దాలు చేసే డి.జే ల వలన చిన్న పిల్లలు, విద్యార్థుల చదువుకు, వృద్ధులు ఆరోగ్యనికి ఇబ్బంది కలుగుతుందని, ప్రజలు శాంతియుత వాతావరణంలో భక్తి శ్రద్దలతో వినాయక చవితి జరుపుకోవాలని సూచించారు.

# మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**బలగం టీవీ, బోయినిపల్లి**

భారత దేశ 6వ ప్రధాని రాజనీతిజ్ఞుడు అతి చిన్న వయసులోనే దేశానికి ప్రధాని అయిన ఏకైక వ్యక్తి పైలట్ భారత రత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 81వ జయంతి సందర్భంగా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి మండల కాంగ్రెస్ పార్టీఆద్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన మండల కాంగ్రెస్ పార్టీనాయకులు. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్,జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కూసరవీందర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కౌడగాని వెంకటేష్,సెస్ డైరెక్టర్ కొట్టేపల్లిసుధాకర్, మాజీ జెడ్పిటిసి పులి లక్ష్మీపతి గౌడ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు నిమ్మ వినోద్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎండి బాబు, గుడి శేఖర్ రెడ్డి, మెరుపుల మహేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎనుగుల కనకయ్య, జంగం అంజయ్య, మాజీ సర్పంచులు కోరేపు నరేష్, వంగపల్లి సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు నాగుల వంశీ, మమ్మద్ హుస్సేన్, పిట్టల రమేష్, ఎండి నజీర్, గ్రామ శాఖ అధ్యక్షులు కేశవరెడ్డి, మండల నరేష్, మండల శ్రీనివాస్, కొండ శంకరయ్య, దెయ్యాల రాజశేఖర్, చేపూరి లచ్చయ్య, మూదం శ్రీనివాస్, దిలీప్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎర్ర రవి, వివేక్, తదితరులు పాల్గొన్నారు.

# సైదాబాద్ అబ్జర్వేషన్ హెూమ్ సందర్శించిన మంత్రి సీతక్క

- లైబ్రరీని ప్రారంభించి విద్యార్థినికి సత్కారం

**బలగం టీవీ, హైదరాబాద్**

సైదాబాద్‌లోని అబ్జర్వేషన్ హెూమ్‌ను శనివారం మంత్రి సీతక్క సందర్శించారు. ఈ సందర్భంగా హెూమ్‌లో ఉన్న విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, వసతులను తెలుసుకున్నారు. అబ్జర్వేషన్ హెూమ్‌ను శిక్ష కేంద్రంగా కాకుండా పరివర్తన కేంద్రంగా భావించాలని పిల్లలకు మంత్రి సూచించారు. "తెలిసో తెలియకో తప్పు జరిగి ఉంటే, గతాన్ని మరిచి బాధ్యతగల పౌరులుగా మారాలి. సమాజంలో మారిన మనుషులుగా బయటికి వెళ్లాలి" అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హెూమ్‌లోని జువెనైల్స్ కోసం ఏర్పాటు చేసిన లైబ్రరీని మంత్రి సీతక్క ప్రారంభించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఆకర్షణ అనే విద్యార్థిని స్వయంగా ఈ లైబ్రరీని ఏర్పాటు చేయడం విశేషం. విద్యార్థుల





జ్ఞానం పెంపొందించాలనే సంకల్పంతో లైబ్రరీని అందించిన ఆకర్షణను మంత్రి శాలువాతో సత్కరించారు.

# జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు వట్టిమల్ల విద్యార్థిని ఆరాధ్య ఎంపిక

- రాష్ట్రస్థాయి అండర్-15 పోటీల్లో ప్రతిభ కనబరచగా అవకాశం

**బలగం టీవీ, హైదరాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామానికి చెందిన ఎస్ఏటీజీ అకాడమీ విద్యార్థిని లాకవత్ ఆరాధ్య జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఈనెల 18, 19 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-15 వాలీబాల్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి అర్హత సాధించింది. గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఆరాధ్య విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, రాబోయే జాతీయ పోటీల్లో కూడా విజయ కేతనం ఎగరేయాలని ఆకాంక్షించారు.





# కాంగ్రెస్‌లో చేరిన రుద్రవరం సింగిల్ విండో చైర్మన్ రేగులపాటి కృష్ణా దేవరావు

- కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం సింగిల్ విండో చైర్మెన్ రేగులపాటి కృష్ణదేవరావు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనకు ఆది శ్రీనివాస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు రేగులపాటి కృష్ణదేవరావు గతంలో వేములవాడ ఎమ్మెల్యేలుగా గెలిచినవారు కనీసం చూద్దామంటే కనిపించలేదని కానీ ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రతిక్షణం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నారని అన్నారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వచ్చి నేడు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు.. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఏ బాధ్యత ఇచ్చిన నెరవేరుస్తూ ముందుకు పోతానని పేర్కొన్నారు..

# అండర్ 15 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొన్న విలసాగర్ విద్యార్థులు

**బలగం టీవీ, బోయినిపల్లి**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో ఇబ్రహీంపట్నంలో ఈనెల 18, 19వ తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 15 ఇయర్స్ వాలీబాల్ పోటీలలో రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం జెడ్.పి.హెచ్.ఎస్ విలాసాగర్ చెందిన నలుగురు విద్యార్తులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో ఎస్.స్పందన, ఎం.భవ్యశ్రీ, ఆర్.హస్విక, బాలుర విభాగంలో ఎస్.శివరామకృష్ణ రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి పోటీలో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్న విద్యార్థులను హెచ్.ఎం.బోలగం శ్రీనివాస్ మరియు పి.డి ప్రభాకర్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.





# దాచారంలో వికలాంగుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలోని దాచారం గ్రామానికి చెందిన కరకవేణి లక్ష్మి ఆగస్టు 15న ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. ఆమె భర్త కరకవేణి రాజు చూపులేని వికలాంగుడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు, కుమారుడు వరుణ్ 9వ తరగతి, కూతురు వైష్ణవి 5వ తరగతి, ఇద్దరు పిల్లలు చదువుకుంటున్నారు. తండ్రికి చూపు లేకపోవడం వలన, ఇంతకాలం కుటుంబానికి పెద్ద దిక్కుగా తల్లి లక్ష్మి కుటుంబాన్ని పోషించింది. కానీ ఆమె అకస్మాత్తుగా మరణించడంతో, పిల్లలు తీవ్ర బాధలో కుమిలిపోతున్నారు. "మా కుటుంబాన్ని ఎవరు పోషించాలి..? అని వారు రోదిస్తున్నారు. ఈ కష్ట సమయంలో దాచారం గ్రామానికి చెందిన ఉస్మానియా యూనివర్సిటీ వికలాంగ జేఏసీ నాయకుడు మారవేణి చంద్రశేఖర్ యాదవ్ తన స్నేహితుల సహకారంతో బుధవారం ఆ కుటుంబానికి రూ.8,800 ఆర్థిక సహాయం అందజేశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ.., "మండలం లోని ప్రజలు పెద్ద మనసుతో ముందుకు వచ్చి ఆ కుటుంబానికి తోడుగా నిలవాలి అని పేర్కొన్నారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా కూడా అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తాను" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మారవేణి రాజు, రగుడ కనకయ్య, గజ్జెల రాజమల్లు, నరికే మల్లేష్ గ్రామస్తులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అజిత్ అగార్కర్ పదవీకాలం పొడిగింపు..!

**బలగం టీవీ, హైదరాబాద్**



భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకుందని సమాచారం. టీమిండియా చీఫ్ సెలెక్టర్‌గా ఉన్న అజిత్ అగార్కర్ పదవీకాలాన్ని 2026 జూన్ వరకు పొడిగించినట్లు సమాచారం. వరుసగా రెండు ప్రతిష్టాత్మక టైటిళ్లు 2024 టీ20 ప్రపంచకప్, 2025 చాంపియన్స్ ట్రోఫీ భారత్ సాధించడంతో, అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీపై బీసీసీఐ పూర్తి విశ్వాసం వ్యక్తం చేసింది. "అగార్కర్ నాయకత్వంలో సెలక్షన్ కమిటీ, జట్టులో విజయవంతమైన మార్పులు తీసుకువచ్చింది. జట్టును రెండు పెద్ద టైటిళ్లు గెలిపించడం మాత్రమే కాకుండా, టెస్టులు, టీ20ల్లో కీలక మార్పులు చేశాడు" అని బోర్డులోని ఒక అధికారి వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

అగార్కర్ పదవీకాలం పొడిగింపు, రాబోయే కీలక టోర్నీల దృష్ట్యా ప్రాధాన్యం సంతరించుకుంది. 2026లో జరగబోయే టీ20 ప్రపంచకప్, అలాగే 2027 వన్డే ప్రపంచకప్ కోసం భారత జట్టును సన్నద్ధం చేయాల్సిన బాధ్యత అగార్కర్‌పై ఉండనుంది. మొత్తంగా, అజిత్ అగార్కర్ కొనసాగింపుతో టీమిండియా స్థిరత్వం సాధించిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.




# 'ఆంధ్రా కింగ్ తాలూకా' రిలీజ్ డేట్ ఖరారు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని నటిస్తున్న యూనిక్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్రా కింగ్ తాలూకా' విడుదల తేదీ ఖరారైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రాన్ని నవంబర్ 28న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో రామ్ స్టైలిష్, ఎనర్జిటిక్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు.మహేష్ బాబు. పి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఇప్పటికే టైటిల్ గ్లింప్స్, బ్లాక్‌బస్టర్ ఫస్ట్ సింగిల్, టైటిల్ టీజర్‌తో భారీ అంచనాలను రేకెత్తించింది. వివేక్, మెర్విన్ కంపోజ్ చేసిన 'నువ్వుంటే చాలే' పాటను అనిరుధ్ రవిచందర్ ఆలపించగా, రామ్ స్వయంగా రాసిన లిరిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యి మంచి క్రేజ్ సంపాదించాయి.

ఈ చిత్రంలో రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర ఒక ప్రముఖ సినీ సూపర్ స్టార్ పాత్రలో కనిపించనున్నారు. రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, విటివి గణేష్ వంటి ప్రముఖ నటీనటులు కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ అంచనాల నడుమ విడుదల కానున్న 'ఆంధ్రా కింగ్ తాలూకా' రామ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందన్న నమ్మకం అభిమానుల్లో కనిపిస్తోంది.





# ఎస్ఎస్ రాజమౌళి - మహేశ్‌బాబు కాంబో హాలీవుడ్ లెవెల్ ప్లానింగ్!

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్లోబల్ స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి, టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు కాంబోలో రాబోతున్న ఎస్ఎస్ఎంబీ 29 సినిమాకు సంబంధించి నవంబర్‌లోనే ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ రాజమౌళి అవుతుందని ప్రకటించాడు. అయితే ప్రత్యేకంగా నవంబర్‌నే ఎందుకు ఫిక్స్ చేశాడో ఇప్పుడు ఇండస్ట్రీలో పెద్ద హాట్‌టాపిక్. అసలు సంగతి ఏంటంటే హాలీవుడ్ లెజెండరీ డైరెక్టర్ జేమ్స్ కామెరాన్ రూపొందిస్తున్న అవతార్: ది ఫైర్ అండ్ యాష్ సినిమా డిసెంబర్ 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ మూవీ ప్రమోషన్స్ కోసం జేమ్స్ కామెరాన్ భారత్‌కు రానున్నాడని సమాచారం. అదే టైంని క్యాష్ చేసుకోవాలని, జేమ్స్ కామెరాన్‌తో కలిసి ఎస్ఎస్ఎంబీ 29 ఫస్ట్ గ్లింప్స్‌ను లాంచ్ చేయాలన్నదే రాజమౌళి ప్లాన్ అని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక రాజమౌళి సినిమా అంటే పబ్లిసిటీ, ప్రమోషన్స్ ఎలా ఉంటాయో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. జక్కన్న ఈసారి ఏకంగా హాలీవుడ్ దిగ్గజాన్ని వేదికగా చేసుకుని గ్లోబల్ మూవీ లవర్స్ దృష్టినంతా ఎస్-ఎస్ఎంబీ 29 మీదే కేంద్రీకరించాలనుకుంటున్నాడని అర్థమవుతోంది. మొత్తానికి, మహేశ్ రాజమౌళి కాంబో మూవీ రిలీజ్ కాకముందే వరల్డ్‌వైడ్ హంగామా స్టార్ట్ అయ్యేలా జక్కన్న భారీ స్కెచ్ వేశాడని చెప్పాలి.

# ఆసియా కప్‌లో భారత్-పాక్ మ్యాచ్‌కు ఓకే

## ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్‌లకు నో.. కేంద్రం కీలక నిర్ణయం



**బలగం టీవీ, హైదరాబాద్**

పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్‌లకు తలుపులు మూసేసింది భారత ప్రభుత్వం. ఇకపై పాకిస్థాన్ జట్టు భారత్‌కు రావడానికీ, భారత జట్టు అక్కడికి వెళ్లడానికీ అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేసింది. అయితే, అంతర్జాతీయ టోర్నమెంట్లలో ఇరు జట్లు తలపడటానికి అభ్యంతరం లేదని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ తెలిపింది.పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో సంబంధాలు తెంచుకోవాలన్న డిమాండ్లు గట్టిగా వినిపించాయి. దీంతో వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్‌లో కూడా భారత్-పాక్ పోరు జరగలేదు. ఈ పరిస్థితుల్లో ఆసియా కప్‌లో మ్యాచ్ జరుగుతుందా లేదా అన్న సందేహం క్రికెట్ అభిమానులను కలవరపరిచింది. తాజా నిర్ణయంతో మాత్రం భారత్-పాక్ మ్యాచ్‌లు ఖాయమయ్యాయి.

ఈ టోర్నీలో గ్రూప్ దశలో భారత్-పాక్ జట్లు రెండు సార్లు తలపడతాయి. సెప్టెంబర్ 14, 21న (గ్రూప్ దశ, సూపర్ 4) పోటీలు జరుగుతాయి. అంతేకాకుండా నాకౌట్ దశలోనూ మరోసారి తలపడే అవకాశం ఉంది. అంటే మొత్తం మూడు సార్లు ఇరు జట్లు మైదానంలో ఢీ కొట్టే పరిస్థితి ఉంటుంది. ఈ అన్ని మ్యాచ్‌లకూ దుబాయ్ స్టేడియం వేదిక కానుంది.

ఈసారి ఆసియా కప్ టీ20 ఫార్మాట్‌లో జరగనుంది. టైటిల్ డిఫెండర్‌గా భారత్ బరిలోకి దిగనుంది. షెడ్యూల్ ప్రకారం భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, శ్రీలంక, , ఒమన్, హాంకాంగ్ జట్లు టోర్నీలో పాల్గొననున్నాయి.

మొదట భారత్ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉండగా, పాకిస్థాన్ భారత్‌లో ఆడేందుకు నిరాకరించడంతో టోర్నీని యూఏఈ వేదికగా మార్చారు.

# చిరంజీవి పుట్టినరోజు కానుకగా 'విశ్వంభర' గ్లింప్స్ విడుదల



**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అభిమానులకు ప్రత్యేక కానుక లభించింది. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్మాత్మక చిత్రం 'విశ్వంభర' టీజర్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ గురువారం విడుదల చేసింది. ఒక నిమిషం 14 సెకన్ల నిడివి గల ఈ టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తూ సినీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సోషియో-ఫాంటసీ శైలిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం, అద్భుతమైన విజువల్స్‌తో అంచనాలను మరింత పెంచింది. 'బింబిసార' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు వశిష్ట ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన మరోసారి తన ప్రత్యేక శైలిలో కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నట్లు టీజర్‌లో స్పష్టమవుతోంది. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆస్కార్ అవార్డు గ్రహీత ఎంఎం కీరవాణి స్వరపరచడం విశేషం. చిరంజీవి సరసన త్రిష కృష్ణన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ బడ్జెట్, అత్యాధునిక సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న 'విశ్వంభర' వచ్చే ఏడాది విడుదల కానుంది.

ఈ సినిమా కోసం కోట్లాదిమంది మెగాస్టార్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో.. వచ్చే ఏడాది వేసవిలో 'విశ్వంభర'ను విడుదల చేయనున్నట్టు గురువారం మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఓ స్పెషల్ వీడియోలో చిరంజీవి మాట్లాడుతూ 'మీ అందరి ముందుకు ఇలా రావడానికి కారణం 'విశ్వంభర'. ఈ సినిమా ఆలస్యం మీకు ఇబ్బందిగా అనిపించొచ్చు. అయితే.. ఈ అలస్యం సముచితమని నేను భావిస్తున్నా. ఎందుకంటే ఈ సినిమా సెకండాఫ్ అంతా వీఎఫ్ఎక్స్, గ్రాఫిక్స్ పైనే ఆధారపడి ఉంది. అత్యున్నతమైన ప్రమాణాలతో, బెస్ట్ క్వాలిటీతో మీకు అందివ్వాలన్నదే మా ప్రయత్నం. ఇక సినిమా విషయానికొస్తే.. ఓ అద్భుతమైన చందమామకథలా ఉంటుంది.

చిన్నపిల్లలకు బాగా నచ్చుతుంది. ముఖ్యంగా పెద్దవాళ్లలో ఉండే చిన్నపిల్లలకు ఇంకా నచ్చుతుంది.' అని తెలిపారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, అషికా రంగనాథ్, కునాల్ కపూర్, మౌనీరాయ్ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: చోటా కె.నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, భీమ్స్ సిసిరోలియో, దర్శకత్వం: వశిష్ట, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, నిర్మాణం: యూవీ క్రియేషన్స్.

# నేడు చిరు 157 టైటిల్ రివీల్

**బలగం టీవీ, హైదరాబాద్**




మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు (ఆగస్టు 22) సందర్భంగా అభిమానులకు ప్రత్యేక విందు సిద్ధమైంది. చిరంజీవి 70వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మెగా 157 మూవీ టైటిల్‌ను ప్రత్యేకంగా ప్రకటించనున్నట్టు పోస్టర్ ద్వారా మేకర్స్ స్పష్టంచేశారు. హైదరాబాద్‌లోని ప్రసాద్ ఐమాక్స్‌లో ఉదయం 11.25 గంటలకు టైటిల్ గ్లింప్స్‌ను రివీల్ చేయనున్నారు. ఫిల్మ్ నగర్‌లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఈ సినిమాకు 'మన శంకర వరప్రసాద్ గారు' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్టు తెలుస్తోంది. ఈ టైటిల్‌ను మరింత బలంగా ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లేందుకు విక్టరీ వెంకటేష్ వాయిస్ ఓవర్ చేయనున్నట్టు సమాచారం. ఇక మరో సర్‌ప్రైజ్ కూడా సిద్ధంగా ఉంది. వాల్తేరు వీరయ్య డైరెక్టర్ బాబీ కొల్లి దర్శకత్వంలో చిరంజీవి మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను ప్రారంభించబోతున్నారు. ఈ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించనుండగా, బర్త్‌డే రోజునే ఈ కొత్త సినిమా గురించి అధికారిక ప్రకటన వెలువడనుంది.